
సాక్షి
ప్రకాశం
శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



అగ్గిపుల్లలతో గణనాథుడు

అగ్గిపుల్లలతో గణనాథుని చిత్రాన్ని తయారు చేసి అబ్బురపరిచారు ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణం శ్రీనివాస థియేటర్ ప్రాంతంలో నివాసం ఉండే నటుకుల తులసీప్రసాద్. వినాయక చవితి పండుగ సందర్భంగా 20 రోజుల నుంచి 23,450 అగ్గిపుల్లలు సేకరించి గణేష్ ప్రతిమను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో లక్ష్మీచెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి రథం, పడవ, ఇంకా పలువురు దేవతా మూర్తులను అగ్గిపుల్లలతోనే తయారు చేసినట్లు తెలిపారు. – మార్కాపురం

గరిష్టం/కనిష్టం
33.5/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రేపు జిల్లా స్థాయి అండర్ 9 చదరంగ పోటీలు

ఒంగోలు: జిల్లాస్థాయి అండర్ 9 చదరంగ పోటీలు స్థానిక భాగ్యనగర్‌లోని దాసరి మిను చెస్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి షేక్ అబ్దుల్ నబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ చాంపియన్‌షిప్ పోటీల పూర్తి వివరాలకు సెల్ 9666725719 నంబర్లను సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు కొనసాగుతున్న సేవలు



వరద బాధితులకు జిల్లా నుంచి పంపుతున్న పాలప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు


ఒంగోలు అర్బన్: కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ఎన్‌టీఆర్ జిల్లా వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆహార ప్యాకెట్‌లు, వాటర్ బాటిల్స్, పాల ప్యాకెట్లు, క్యాండిల్స్, అగ్గిపెట్టెలు విజయవాడకు పంపారు. దాదాపుగా లక్ష ఆహార ప్యాకెట్లను శుక్రవారం పంపారు. విజయవాడ నగరంలో సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల ఆధ్వర్యంలో వరద బాధితులకు వాటిని అందించేలా చర్యలు తీసుకున్నారు.

వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా కుప్పం ప్రసాద్



ఒంగోలు: వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా కుప్పం ప్రసాద్ మరోమారు నియమితులయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షునిగా, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించడంతోపాటు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కుప్పం ప్రసాద్‌ను వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

వైఎస్సార్ సీపీ నాయీబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా టి.పుల్లయ్య



గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా టి.పుల్లయ్యను వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. టి.పుల్లయ్య స్వగ్రామం గిద్దలూరు మండలం నరవ గ్రామం కాగా ఆయన వ్యాపార రీత్యా తిరుపతిలో ఉంటున్నారు. గతంలో ఆయన నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయి బ్రాహ్మణులు కృషి చేస్తారని తెలిపారు. తన పై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత తన పై ఉంచినందుకు జగన్‌మోహన్‌రెడ్డికి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వసతి గృహాల్లో గతి తప్పిన సంక్షేమం

పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ' వసతి గృహాల్లో నిర్లక్ష్య 'క్షామం' కనిపిస్తోంది. హాస్టళ్లు.. ప్రత్యక్ష నరకానికి నకళ్లుగా మారాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా.. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు వసతి గృహాల వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వసతులతో పాటు మెనూ విషయంలోనూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండేది. కూటమి పాలన వచ్చాక వసతి గృహాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వసతి గృహాల్లోని గదులు, మరుగుదొడ్లు తలుపు మరమ్మతులు చేపట్టకుండా వదిలేసింది. తాగునీటి, స్నానాల వాటర్ ట్యాంక్‌లు అపరిశుభ్రంగా ఉండడంతో డయేరియా బారిన పడుతున్న పరిస్థితి ఏర్పడింది. గతంలో వసతి గృహాలకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన బియ్యం సరఫరా అయితే.. గడిచిన మూడు నెలలుగా ముక్కిన బియ్యం పంపిణీ చేయడంతో నాణ్యమైన మెనూ అమలు చేయకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. డైట్ చార్జీలు విడుదల చేయకపోవడంతో నీళ్ల సాంబార్ మెతుకులే గతి అయ్యాయి. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకపోవడంతో తల్లిదండ్రుల దగ్గర నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. జిల్లాలో వసతి గృహాల్లో వాస్తవ పరిస్థితులపై 'సాక్షి **గ్రౌండ్ రిపోర్ట్**'.

జిల్లాలోని వసతి గృహాలు : 175
విద్యార్థుల సంఖ్య : 16,162 మంది



- హాస్టళ్లను పట్టించుకోని పాలకులు
- మెస్ బిల్లులు రాక భోజనానికి అప్పుల తిప్పలు
- అప్పులపై సరుకులు ఇచ్చేందుకు వెనకాడుతున్న వ్యాపారులు
- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని భోజనం
- ఐదు నెలలుగా వెండర్స్‌కు బిల్లులు లేవు
- సంక్షేమాధికారులకు బిల్లులు రాక ఇబ్బందులు
- విద్యార్థులకు అందని కాస్మోటిక్ చార్జీలు
- గురుకులాల్లో సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు
- **పాఠశాలలకు రాని నిర్వహణ బిల్లులు**
- సంక్షేమ వసతి గృహాల్లో కనిపించని సంక్షేమం

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...

పోస్ట్ మెట్రిక్ (కళాశాల) వసతి గృహాలు :	16
ప్రీ మెట్రిక్ వసతి గృహాలు	50
బాలుర హాస్టళ్లు : 50	బాలికల హాస్టళ్లు : 10
వసతి పొందుతున్న విద్యార్థులు : 5,232 మంది	

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో...

పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు	ప్రీమెట్రిక్ వసతి గృహాలు
20	61
బాలుర హాస్టళ్లు : 47	బాలికల హాస్టళ్లు : 14
వసతి పొందుతున్న విద్యార్థులు : 7,230 మంది	

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు :	గిరిజన గురుకుల పాఠశాలలు :	కళాశాల వసతి గృహాలు :
15	8	5
వసతి పొందుతున్న విద్యార్థులు : 3,700 మంది		

ఒంగోలు సెంట్రల్: 'చదువుకుంటే బతుకు బాగుంటుందని భావించే తల్లిదండ్రులు పిల్లలను ఎన్ని కష్టాలు పడైనాసరే చదివించుకుంటారు. అవసరమైతే అప్పులు చేసి మరీ పిల్లలను ఉన్నత విద్యకు పంపుతారు. ఆర్థిక స్తోమత లేని బడుగు, బలహీనవర్గాల పిల్లలను ఇంటికి దూరంగా ఉండే వసతి గృహాల్లో చేరుస్తారు. అక్కడ వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని వసతులు కల్పిస్తుందని కలలు కంటారు. తమ పిల్లలు చదువుకుంటే తమ కష్టాలు అవే తీరిపోతాయని ఆశపడతారు. కానీ, క్షేత్రస్థాయిలో వసతి గృహాలను పరిశీలిస్తే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలు 175 ఉన్నాయి. అందులో దాదాపు 16,162 మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. పలు వసతి గృహాలు సంక్షామ' వసతి గృహాలుగా మారిపోయాయి. నిర్వహణే కాదు.. నెలవారీ ఖర్చులకు డబ్బు మంజూరు చేయడంలోనూ జాప్యం నెలకొంది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా తలకు నూనె కొనాలన్నా, ఒంటికి సబ్బు కావాలన్నా తల్లిదండ్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. కాస్మోటిక్స్ చార్జీలు 3 నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థినులకు రూ.130, విద్యార్థులకు రూ.125, 7 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థినులకు రూ.250, బాలురకు రూ.200 ఇవ్వాలి. బాలురకు హెయిర్ కటింగ్ చార్జీలకు రూ.50 చొప్పున అందించాలి. వీటిని కూటమి ప్రభుత్వం ఇంతవరకూ చెల్లించకపోవడం గమనార్హం.



ఒంగోలు అన్నవరప్పాడులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో బండలపైనే నిద్రిస్తున్న విద్యార్థి అభినయ్

సంరక్షకులపై భారం...

ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలి. అంతా సమకూర్చే బాధ్యత ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులపై ఉంటుంది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా మెస్ చార్జీలు ఇంత వరకు విడుదల చేయలేదు. లక్షలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పులు చేసి మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి. బిల్లులు పెరిగేకొద్దీ వ్యాపారస్తులు అప్పులు ఇచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి 3, 4 తరగతుల వారికి రూ.1,150, 5 నుంచి 10వ తరగతి వారికి రూ.1,400, ఇంటర్, పీజీ విద్యార్థులకు రూ.1,600 చొప్పున మెస్ చార్జీలను ప్రభుత్వం చెల్లించాలి. అవి చెల్లించకపోవడంతో మెనూ ప్రకారం భోజనం అందడంలేదు.

ఒక గదికి 40 మంది విద్యార్థినులు...

చీమకుర్తి: ఎస్సీ బాలికల వసతి గృహంలో పరిస్థితి దారుణంగా ఉంది. ఒక గదిలో 30 నుంచి 40 మంది బాలికలు పడుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇక బాత్‌రూంలు, టాయిలెట్ల గురించి ఆలోచిస్తేనే భయంగా ఉంటోందని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 100 మంది ఉండాల్సిన చోట 200 మంది ఉంటున్నారు. ఒంగోలు హాస్టల్లో పనిచేస్తున్న ఆయన.. ఇక్కడ హాస్టల్ వార్డెన్‌గా ఉన్నారు. తీరిక ఉన్నప్పుడు ఆయన చీమకుర్తి వస్తారు. ఆయాలు, వాచ్‌మెన్‌లు వార్డెన్ విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. అదనపు భవనాలు నిర్మించేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరైనా పనులు కార్యరూపం దాల్చకపోవడం విచారకరం. ఎస్సీ బాలుర హాస్టల్లో సైతం వసతులు దారుణంగా ఉన్నాయి. హాస్టల్ భవనానికి మరమ్మతులు చేస్తుండటంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.



చీమకుర్తి ఎస్సీ బాలుర హాస్టల్లో తలుపులు, స్లాబులు లేని మరుగుదొడ్లు

పారిశుధ్యం అధ్వానం...

కనిగిరి రూరల్: నియోజకవర్గంలో ఎస్సీ హాస్టళ్లు, బీసీ హాస్టళ్లలో దాదాపు సగానికిపైగా అద్దె భవనాల్లో చాలీచాలని గదుల్లో నడుస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. నీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనిగిరి మండలంలో పలు వసతి గృహాల కిటికీలకు దోమతెరలు లేకపోవడంతో రాత్రివేళ దోమలకు ఇబ్బందులు పడుతున్నారు. పామూరు బీసీ హాస్టళ్లలో బాత్‌రూమ్‌లకు తలుపులు లేవు. విద్యార్థులకు సరిపడా గదులు లేవు. పీసీ పల్లి, వెలిగండ్ల మండలాల్లో స్నానాలకు గదుల్లేక విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.



పీసీ పల్లిలో ఆరుబయట స్నానం చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

అరకొర వసతులు...

సింగరాయకొండ: సింగరాయకొండ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో భోజనం చేసేందుకు వసతి లేకపోవడంతో విద్యార్థినులు షిఫ్టుల వారీగా భోజనం చేయాల్సి వస్తోంది. పాఠశాలలో గదుల సమస్య వేధిస్తోంది. జూన్ నెల నుంచి క్లీనింగ్ మెటీరియల్ రాలేదు. ప్రస్తుతం ఉన్న అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ సిస్టంతో తరచూ సాంకేతిక సమస్య తలెత్తుతోంది.

పొన్నలూరు మండలం మాలపాడు కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. మరుగుదొడ్లు, స్నానపు గదుల సమస్య వేధిస్తోంది. అదనపు తరగతి గదులు నిర్మించినా సౌకర్యాలు కల్పించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

కొండపి గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా క్లీనింగ్ మెటీరియల్ అందలేదు. విద్యార్థినులకు సరిపడా వసతులు లేవు.



గదుల్లో వసతులు లేక వరండాలోనే విద్యార్థుల ట్రంకు పెట్టెలు

వరండాల్లోనే పడక...

యర్రగొండపాలెం: నియోజకవర్గంలోని ఎస్సీ బాలురు, బాలికల హాస్టళ్లలో వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ రెండు వసతి గృహాలకు సంబంధించిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. నీటి వసతి, మరుగుదొడ్ల వసతి అరకొరగా ఉందిరు ఆరుబయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాలుర హాస్టల్లో 63 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరు బస చేయడానికి 8 గదులు ఉన్నాయి. బాలికల వసతి గృహంలో 260 మంది విద్యార్థినులు ఉంటున్నారు. వీరు బస చేయడానికి కేవలం 5 గదులు మాత్రమే ఉన్నాయి. డైనింగ్ రూం, స్టోర్ రూం, రాత్రివేళ నిద్ర కూడా వరండాల్లోనే పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాత్‌రూంలు 10 ఉన్నప్పటికీ కేవలం 5 మాత్రమే ఉపయోగంలో ఉన్నాయని విద్యార్థినులు తెలిపారు. ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి కనిపించింది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అంటువ్యాధులతో అవస్థలు...

దర్శి: నియోజకవర్గంలో గురుకుల, సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. హాస్టళ్లు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు అంటువ్యాధులతో బాధపడుతున్నారు. గజ్జి, తామర విద్యార్థులను ఇబ్బంది పెడుతోంది. మూడు నెలల నుంచి కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదు. దర్శి అంబేడ్కర్ గురుకుల పాఠశాలల విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

గురుకులాల్లో సిబ్బందికి జీతాల్లేవ్...

జిల్లాలో 11 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. నేటి వరకు జూన్, జూలై, ఆగస్టు నెలల జీతాలు ఇవ్వలేదు. ఏప్రిల్ నెల నుంచి సరుకులు, గుడ్లు, పాలు, గ్యాస్, ప్రొవిజన్స్ సరఫరా చేసే వెండర్స్‌కు బిల్లులు చెల్లించలేదు. పాఠశాలలకు ఫినాయిల్, చీపుర్లు, నెట్లు, కంప్యూటర్ల మెయింటెనెన్స్‌గా ప్రతి ఏడాది ఇచ్చే రూ.10,000 ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ఒకవైపు జీతాలు రాక, మెయింటెనెన్స్ బిల్లులు మంజూరు కాక ప్రిన్సిపాళ్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ హాస్టళ్లకు డైట్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.


చుట్టాలు ఇసుకను దోచేస్తున్నారు

- మంత్రి స్వామి స్వగ్రామంలో అభివృద్ధి పనుల కోసమంటూ అధికారుల హడావుడి
- ఇసుక రవాణాలో రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల బంధువులు, పోలీస్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగి
- ఇసుకను చుట్టు పక్కల ప్రాంతాలకు తరలిస్తున్న ఇసుక మాఫియా
- ఎటువంటి అనుమతులు ఇవ్వలేదంటున్న మైనింగ్ శాఖ జిల్లా అధికారి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఇసుకను అడ్డగోలుగా దోచేస్తున్నారు. మూడు రోజులుగా రీచ్‌ల నుంచి అనధికారికంగా ఉదయం నుంచి రాత్రి వరకూ ట్రాక్టర్లతో యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ దందా వెనుక పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల్లో పనిచేస్తున్న అధికారుల బంధువులతో పాటు, పోలీస్ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగి ఒకరు ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయ స్వామి స్వగ్రామంలో సిమెంటు రోడ్డు వేస్తున్నారని, అక్కడకు ఇసుక తరలిస్తున్నామని రవాణాదారులు చెబుతున్నారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలంలో చింతలపాలెం, జరుగుమల్లిల్లో రెండు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటి నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు అక్రమార్కులు కన్నేశారు. అందుకు సంబంధించి పక్కా పథకాన్ని రచించారు. అందులో భాగంగా ఈనెల 5వ తేదీ టంగుటూరు మండలం కాకుటూరివారిపాలేనికి 20 ట్రాక్టర్ల ఇసుక కావాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఈనెల 6వ తేదీ టంగుటూరు మండలం నాయుడుపాలెం (మంత్రి డోల స్వగ్రామం)కు 25 ట్రాక్టర్ల ఇసుక కావాలని టంగుటూరు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ శ్రీహరి జరుగుమల్లి ఎస్సై పున్నారావుకు రాతపూర్వకంగా తెలిపారు. పోలీసులకు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవటమే తప్ప ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చే అధికారం లేదు. ఇదే విషయాన్ని ఆశాఖ ఉన్నతాధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు. మరో పక్క తహశీల్దార్ బీ జనార్దన్ సైతం ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చే అధికారం తనకు లేదని పేర్కొంటున్నారు. ఎస్సై పున్నారావు మాత్రం 'స్వామి' భక్తి చూపిస్తూ అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి పంచాయతీ సెక్రటరీ 20 ట్రిప్పులు, ఏఈ 25 ట్రిప్పులు అడిగారు. అయితే రెండు రీచ్‌ల నుంచి మూడు రోజులుగా అక్రమార్కులు సుమారు 120 ట్రిప్పులో ఇసుకను తోలుకుపోయారు. వాస్తవానికి కాకుటూరివారిపాలెం, నాయుడుపాలెంకు సుమారు 15 ట్రాక్టర్ల ఇసుక మాత్రమే సరఫరా చేయగా టంగుటూరు, నందనవనం, కలికవాయ, ఆలకూరపాడు గ్రామాలకు సుమారు 105 ట్రాక్టర్ల ఇసుక సరఫరా అయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ఇసుక మాఫియా ట్రాక్టరుకు రూ.4 వేలు వసూలు చేస్తూ అక్రమ దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. శుక్రవారం జరుగుమల్లి ఇసుక రీచ్‌లో అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్న తహశీల్దార్ బీ జనార్దన్ వారిపై కేసులు బనాయించకుండా ఉదారంగా పంపేయటాన్ని బట్టి పచ్చతమ్ముళ్లు ఏరకంగా ఆయనపై ఒత్తిడి చేస్తున్నారో అర్థమవుతోందని స్థానికులు అంటున్నారు. ఇంత జరుగుతున్నా సెబ్ అధికారులు మాత్రం ఈ ఛాయలకు రాలేదు. ఉన్నతాధికారులు అడిగితే తాము గతంలో చేసిన ఘన కార్యాలు ఏకరువు పెడుతున్నారే తప్ప ఈ మధ్య కాలంలో జరిమానాలు వేసిన విషయాన్ని చెప్పకపోవడం వారి పనితీరుకు అద్దంపడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అవసరాలకు ఇసుక కావాల్సి వస్తే అనుమతి ఇవ్వాల్సింది మైనింగ్ శాఖ. కానీ మైనింగ్ శాఖ జిల్లా అధికారి జగన్నాథరావు తనను ఎవరూ ఇసుక కావాలని అడగలేదని, ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిలో పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న అధికారికి అన్న కుమారుడు, రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారి సమీప బంధువు, పోలీస్‌శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగుల హస్తం ఉందన్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. మండలంలో మూడు రోజులుగా ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తూ పట్టీ పట్టనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఇసుక అక్రమార్కులకు దండాలు పెడుతూ జీ హుజూర్ అంటున్నారని, పచ్చ తమ్ముళ్లు అడ్డంగా దోచుకుంటూ వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఉదయం 9 గంటలకు జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఇసుక అక్రమరవాణా



టంగుటూరు పంచాయతీ రాజ్ ఏఈ జరుగుమల్లి ఎస్సైకి ఇచ్చిన లేఖ

వినాయక చవితి శుభాకాంక్షలు

ఒంగోలు: నేడు వినాయక చవితి పర్వదినం సందర్భంగా పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ఉన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా భక్తి శ్రద్ధలతో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని కోరారు.

క్లుప్తంగా

కూల్‌డ్రింక్ దుకాణంలో చోరీ



టంగుటూరు చోరీ జరిగిన దుకాణంలో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

టంగుటూరు: కూల్‌డ్రింక్ దుకాణంలో దొంగలు పడి నగదు చోరీ చేసిన సంఘటన టంగుటూరు సెంటర్లో గురువారం రాత్రి చేసుకుంది. బాధితుడు పాదర్తి చెంచురామయ్య తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు సెంటర్‌లో కూల్ డ్రింక్ పెట్టుకొని జీవనం సాగిస్తుంటాడు. ఎప్పటి లాగే రాత్రి 11 గంటలకు వరకు దుకాణంలో విక్రయాలు నిర్వహించి మూతేసి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా దుకాణం వెనుక వైపు తలుపు తాళం పగలటం చూసి పరిశీలించగా దుకాణంలో వస్తువులన్నీ చల్లాచెదురుగా పడి ఉన్నాయి. సొరుగులో ఉన్న రూ. 1500 రూపాయలను తీసుకొని ఉడాయించారు. ఇది ఇలా జరగటం రెండోసారి. ఇదే దుకాణంలో ఆగస్టు నెల 12వ తేదీన దొంగల చొరబడి రూ. 25 వేలు అపహరించారు. దీనిపై టంగుటూరు పోలీసులకు సమాచారం అందించగా క్లూస్‌టీం వచ్చి దుకాణంలో క్షుణ్ణంగా పరిశీలించి, వేలిముద్రలు సేకరించారు.

సాగర్ కాలువలో యువకుడు గల్లంతు

త్రిపురాంతకం: సాగర్ ప్రధాన కాలువలో స్నానానికి వెళ్లిన యువకుడు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. త్రిపురాంతకం మండలం ఎండూరివారిపాలెం వద్ద ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండూరివారిపాలెం గ్రామానికి చెందిన వి.వెంకటనారాయణ (29) గురువారం సాయంత్రం ఈతకొడుదూ నీటి ప్రవాహ ఉధృతికి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం సాగర్ కాలువ పొడవునా శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు క్రీడాకారుడు



లింగయ్యను అభినందిస్తున్న కోచ్ రవికుమార్

చీమకుర్తి: జాతీయ స్థాయి జూనియర్ హాకీ క్రీడా పోటీల్లో ఏపీ నుంచి పాల్గొనే జట్టుకు సంతనూతలపాడు మండలం మైనంపాడు హాకీ క్లబ్‌కు చెందిన క్రీడాకారుడు పెరుగు లింగయ్య ఎంపికయ్యాడు. ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగే 14వ జాతీయ హాకీ జూనియర్ పురుషుల పోటీల్లో మైనంపాడు క్రీడాకారుడు పాల్గొననున్నట్లు కోచ్, మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు పీఈటీ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లింగయ్యను కోచ్‌తో పాటు మైనంపాడు హాకీ క్లబ్ సభ్యులు అభినందించారు.



కొత్త కూరగాయల మార్కెట్ వద్ద తొలగించిన దుకాణాలు



కర్నూలు రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఎదురుగా నిలిపి ఉన్న మోటారు బైకులు



హోటళ్ల ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేసిన కార్లు

పొట్ట కొట్టి.. కొట్లు పడగొట్టి!

- చిరు వ్యాపారులపై పోలీసులు, అధికారుల ప్రతాపం
- కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఆక్రమణల తొలగింపులు
- రోడ్డున పడిన పేదలు
- మాల్స్ వద్ద మాత్రం దగ్గరుండి మరీ ట్రాఫిక్ నియంత్రణ

ఒంగోలు టౌన్: చిరువ్యాపారులపై పోలీసుల పిడి గుద్దులు పడ్డాయి. దీంతో వారి కడుపు కొట్టినట్లైంది. కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్ జామ్ సాకుతో ఇటీవల పోలీసులు చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్టాండు పక్క నుంచి రంగరాయుడు చెరువుకు వెళ్లే దారిలో కొందరు నక్కల సామాజిక వర్గానికి చెందిన పేదలు రోడ్డు పక్కన దుకాణాలను ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. అద్దాలు, దువ్వెనలు, ప్లాస్టిక్ పూలు, పిన్నీసులు విక్రయిస్తూ పొట్ట నింపుకుంటున్నారు. అలాగే కొత్త కూరగాయల మార్కెట్ చౌరస్తాలో కొందరు జామకాయలు, మామిడి కాయలను విక్రయిస్తుంటారు. కూరగాయల మార్కెట్ పక్కనే చికెన్, మటన్, చాపల దుకాణాలు ఉన్నాయి. మరోవైపు టీ దుకాణాలు, బీడీ బంకులు నిర్వహించుకుంటూ వీరంతా జీవనం సాగిస్తుంటారు. దీంతో ఈ ప్రాంతమంతా నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వాస్తవానికి క్రమం తప్పకుండా ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి. కానీ ఇందుకు విరుద్ధంగా ట్రాఫిక్‌కు సమస్యగా ఎక్కువగా ఉందని రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారుల దుకాణాలను బుధవారం తొలగించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జేసీబీలతో ప్రత్యక్షమయ్యారు. పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీసులు, నగర పాలక సంస్థ సిబ్బంది రంగంలోకి దిగి దుకాణాలను పడగొట్టారు.

నగరంలోని ప్రధాన వీధులన్నీ ఇంతే...

నిజానికి నగరంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ సమస్య కనిపిస్తోంది. నగరంలో ఏ వీధిలో చూసినా తరచూ ట్రాఫిక్ రద్దీ కనిపిస్తోంది. పత్తివారి బజారు నుంచి గాంధీ రోడ్డు వరకు ప్రతి రోజూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. గాంధీ రోడ్డు నుంచి దక్షిణం బజారు వైపు కూడా రోజు మొత్తం మీద ఒక్కసారైనా ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఉండదు. బండ్లమోటు నుంచి వాసవి బజారు ద్వారా గాంధీ రోడ్డుకు వెళ్లాలంటే పెద్ద తలనొప్పిగా తయారైంది. ఇక్కడ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల కూడా ఉంది. ప్రతిరోజూ పాఠశాల ప్రారంభ సమయమైన ఉదయం, పాఠశాల విడిచిపెట్టే సమయమైన సాయంత్రం పూట అయితే గంటల తరబడి వాహనాలు నిలిచిపోతుంటాయి. ద్విచక్రవాహనాలు, ఆటోల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో పాటు దుకాణాలు ఎక్కువగా ఉండటం వలన సరుకు దించడం, ఎత్తడం జరుగుతుంటుంది. బంగారు కొట్ల బజారు, గాంధీ రోడ్డు నుంచి సీవీఎన్ రీడింగ్ రూం వెళ్లే బజారులో కూడా ఆటోలు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక రద్దీ ఏర్పడి ప్రజలు అగచాట్ల పాలవుతున్నారు. కోర్టు ఎదురు, రంగరాయుడి చెరువు ప్రాంతంలో కూడా ట్రాఫిక్ సమస్య నిత్య కృత్యంగా మారింది. ఇస్లాంపేటలోని కృష్ణ థియేటర్ వీధిలో కూడా ట్రాఫిక్ సమస్య ఇబ్బందులు పెడుతోంది. ఇరుకైన ఈ వీధుల్లో స్కూలు బస్సులు, లారీలు, కార్లు తిరగుతూ ప్రజల సహనాన్ని పరీక్షిస్తుంటాయి. గుంటూరు రోడ్డులో అద్దంకి బస్టాండు నుంచి రవి ప్రియ మాల్ వెళ్లే దారిలో కూడా ఇంతే. మస్తాన్ దర్గా ప్రాంతం నగరంలోనే జఠిలమైన ప్రాంతంగా చెప్పవచ్చు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. ఇరుకైనా ఈ వీధుల ద్వారానే కొత్తపట్నం, కందుకూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు వెళ్లాల్సి ఉంటుంది. ఇక ఉదయం 9 గంటల ప్రాంతంలో వరసగా వచ్చిపడే స్కూలు బస్సులు , రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఆటోలు, ద్వి చక్రవాహనాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పట్నం బస్టాండు సెంటర్లో టూ టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఆర్టీసీ బస్సులు నిలవడంతో కమ్మపాలెం ప్రజలకు ఇబ్బందిగా మారింది.

పార్కింగ్ వసతి లేని మాల్స్

నగరంలో అనేక షాపింగ్ మాల్స్ ఉన్నాయి. ఇటీవల కాలంలో కర్నూలు రోడ్డులో నూతనంగా తెరిచినన్ని మాల్స్ ఎక్కువ. అయితే ఒక్క మాల్‌కు కూడా పార్కింగ్ సౌకర్యం లేదు. అద్దంకి బస్టాండు నుంచి మొదలుకొని ఆర్టీసీ బసాండు వరకు కొత్తగా తెరచిన మాల్స్ వలన నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అయినప్పటికీ పోలీలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాల్స్ దగ్గర ఏర్పడుతున్న రద్దీని క్రమబద్ధీకరించేందుకు హోంగార్డులను నియమించారు. ఇదే మార్గంలో పలు జ్యూయలరీ దుకాణాలు కూడా ఉన్నాయి. ఇటు షాపింగ్ మాల్స్, అటు జ్యూయలరీతో పాటు స్టేట్ బ్యాంకు, సిటీ యూనియన్ బ్యాంకులున్నాయి. స్టేట్ బ్యాంకు దగ్గర పార్కింగ్ లేకపోవడంతో రోడ్డు మీదే వాహనాలను నిలుపుతున్నారు. కర్నూలు రోడ్డులో పెద్ద పెద్ద హోటళ్లు ఉన్నాయి. ఇక్కడ పార్కింగులు లేకపోవడంతో కార్లను రోడ్ల మీదే నిలుపుతున్నారు. పెద్ద కార్లు సగం రోడ్డును ఆక్రమిస్తున్నాయి. 60 అడుగుల రోడ్డు, సుందరయ్య రోడ్డులో ఆసుపత్రులకు చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ మార్గంలో రోగులతో వచ్చిపోయే ఆటోలు, కార్లతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడి ఇబ్బందిగా ఉంటుంది. ఈ రోడ్లులోని ఆసుపత్రులకు కూడా పార్కింగ్ సౌకర్యం లేకపోవడం సమస్యను మరింత జఠిలం చేస్తోంది.

బడా వ్యాపారులకు అండ..
చిరువ్యాపారులపై దాష్టీకం

నగరంలో పోలీసులు బడా వ్యాపారులకు సలాం చేస్తూ దుకాణాల వద్ద కాపలా కాస్తున్నారు. బడా వ్యాపారులు, షాపింగ్ మాల్ యజమానులు ఎలాంటి ట్రాఫిక్ నిబంధనలను పాటించక పోయినప్పటికీ పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కర్నూలు రోడ్డులో ఇటీవల ప్రారంభించిన ఒక షాపింగ్ మాల్ ఎదుట జనం రద్దీగా ఉంటున్నారు. పెద్ద ఎత్తును ఆఫర్లు ప్రకటించడంతో ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. ఇప్పటికీ ఆ షాపింగ్ మాల్ వద్ద ఇదే తంతు కొనసాగుతోంది. అయినప్పటికీ పోలీసులు చోద్యం చూస్తున్నారు. దగ్గరుండి మరీ వారి వ్యాపారాలు కొనసాగేందుకు సహకరిస్తున్నారు. బడాబాబుల వ్యాపారాలు దెబ్బతినకుండా కాపలా కాస్తున్న పోలీసు యంత్రాంగం చిరువ్యాపారుల వ్యాపారాలను పట్టించుకోకుండా జేసీబీలు తెచ్చి పడగొట్టడం సరైంది కాదని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకొని పొట్ట పోసుకుంటున్న చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారుల మీద మాత్రం పోలీసులు దాష్టీకం ప్రదర్శిస్తున్నారు. కూరగాయల మార్కెట్ వద్ద పడగొట్టినట్టే కర్నూలు రోడ్డులోని మాల్స్‌ను కూడా పడగొడతారా అని ప్రశ్నిస్తున్నారు.

మాకు న్యాయం చేసేవారే లేరు



మూడు తరాల నుంచి మేము ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నాం. దువ్వెనలు, అద్దాలు, పిన్నీసులు అమ్ముకొని జీవిస్తుంటాం. మా దుకాణాలు ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్నాయట. దుకాణాలను వెనక్కి జరుపుకునేందుకు అవకాశం ఇవ్వాలి కదా. అసలు దుకాణాలే లేకుండా పడకొదితే ఎలా బతకాలి?

– పి. అనురాధ, చిరువ్యాపారి

మాకు అన్యాయం జరిగింది



నేను రోడ్డు పక్కన చిన్న కొట్టు పెట్టుకొని జామకాయలను అమ్ముతుంటాను. 16 సంవత్సరాలుగా ఇక్కడే వ్యాపారం చేస్తున్నా. ఇప్పుడు ట్రాఫిక్‌కు సమస్య ఏర్పడుతుందని మా దుకాణం పడగొట్టారు. మా పిల్లలు చదువుకుంటున్నారు. వారి చదువులు ఎలా కొనసాగాలి?

– భీమవరపు జాలయ్య, జామకాయల వ్యాపారి

స్కూల్ బస్సు బోల్తా



బస్సు డ్రైవర్‌ను విచారిస్తున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్సై శివరామయ్య

- 16 మంది విద్యార్థులకు తప్పిన పెనుప్రమాదం

మద్దిపాడు: స్కూల్ బస్సు బోల్తా పడగా, అందులో ఉన్న 16 మంది విద్యార్థులకు అదృష్టవశాత్తూ పెను ప్రమాదం తప్పింది. మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆ వివరాల ప్రకారం.. ప్రతిభ స్కూల్ పేరుతో గుండ్లాపల్లిలో నడుపుతున్న ఒక విద్యాసంస్థకు చెందిన బస్సు మల్లవరం నుంచి విద్యార్థులను ఎక్కించుకుని గుండ్లాపల్లి బయలుదేరింది. వెల్లంపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన మరో బస్సును తప్పించబోయి రోడ్డు పక్కనే పల్లంలోకి ఒరిగిపోయింది. ఆ సమయంలో బస్సులో 16 మంది విద్యార్థులు ఉన్నారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై శివరామయ్య.. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయురాలి తీరుపై విచారణ

- అసభ్యంగా మాట్లాడుతుందంటూ విద్యార్థినుల ఫిర్యాదు
- సస్పెండ్ చేసిన తర్వాత మళ్లీ అదే పాఠశాలలో పోస్టింగ్ ఇవ్వడంపై తల్లిదండ్రుల ఆగ్రహం

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరంలో పీఎస్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎస్‌కే షహనాజ్ తీరుపై శుక్రవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను అసభ్య మాటలు, చేతల ద్వారా చిత్రహింసలకు గురిచేస్తోందని చైల్డ్ వెల్ఫేర్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మావతికి విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు ఇద్దరు శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 7 నుంచి 10వ తరగతి విద్యార్థినులను ప్రత్యేకంగా విచారించి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ క్రమంలో కొందరు తల్లిదండ్రులు మీడియా మాట్లాడుతూ.. దొడ్డవరం పాఠశాలలో 2024 జనవరి 5వ తేదీ సస్పెండ్ అయిన ఉపాధ్యాయురాలు షహనాజ్‌ను డిప్యుటేషన్‌పై డీఈఓ కార్యాలయం వారు మరో పాఠశాలకు పంపారని, అక్కడి నుంచి మళ్లీ మూడునెలల వ్యవధిలోనే దొడ్డవరం పాఠశాలకు పంపడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. డీఈఓ కార్యాలయంలో అక్రమాలు, అవినీతి కారణంగానే షహనాజ్‌కు మళ్లీ దొడ్డవరం పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారంటూ ఆరోపించారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ఆమె ప్రవర్తించడంపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. షహనాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు.

ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన చరణ్

గిద్దలూరు రూరల్: ప్రైవేటు బస్సు ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన గిద్దలూరు మండలంలోని శింగంపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని జమ్ముశ్లపల్లె గ్రామానికి చెందిన చెన్నబోయిన చరణ్ బైక్‌పై గిద్దలూరు నుంచి స్వగ్రామం వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చరణ్ కాళ్లు, చేతులు, తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ బస్సుతో సహా పారిపోయేందుకు ప్రయత్నించాడు. స్థానికుల సమాచారం మేరకు కలసపాడు వద్ద పోలీసులు బస్సును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక సీఐ సురేష్‌యాదవ్ తెలిపారు.



అమ్మకానికి సిద్ధంగా..



పత్రి కొనుగోలు కోసం వచ్చిన భక్తులు

శివశివ మూర్తివి గణనాథా!

వినాయక చవితి పురస్కరించుకొని శుక్రవారం భక్తులు పూజా సామగ్రి, పత్రి కొనుగోలు చేస్తూ సందడిగా కనిపించారు. శనివారం పండుగ కావడంతో ముందుగానే వాటిని సమకూర్చుకున్నారు. ఒంగోలు నగరంలో భారీ మండపాలు.. భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు.– సాక్షి, ఒంగోలు








వివిధ రూపాల్లో గణపయ్య









రామతీర్థం ఓరియంట్ క్వారీలో ప్రమాదం

- పెద్ద ఎత్తున జారిపడిన రాళ్లు, మట్టిపెళ్లలు
- పరిశీలించిన ఎస్పీ దామోదర్
- విచారణకు ఆదేశం



క్వారీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: చీమకుర్తిలోని రామతీర్థంలో గల ఓరియంట్ క్వారీలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ప్రమాదం సంభవించింది. క్వారీలోని హైవాల్ వద్ద పెద్ద ఎత్తున రాళ్లు, మట్టిపెళ్లలు జారిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ పరిశీలించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఏదైనా బ్లాస్టింగ్ వలన ప్రమాదం జరిగిందా.. లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని, ప్రత్యేక టీములను నియమించి మిగతా క్వారీల్లోని భద్రతా ఏర్పాట్లను కూడా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా క్వారీలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐ సుబ్బారావు, ఎస్సై కృష్ణయ్యలను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు, నిర్వాహకులు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ...

రామతీర్థం వచ్చిన ఎస్పీ దామోదర్ చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, గదులు, రిసెప్షన్ కౌంటర్లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు, నేరాల నివారణకు సంబంధించిన వ్యూహాల గురించి సీఐ సుబ్బారావును అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని, పెట్రోలింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేలా పోలీసు సిబ్బందికి గ్రామాలను కేటాయించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఎస్పీ సీఐ రాఘవేంద్ర, చీమకుర్తి సీఐ సుబ్బారావు, ఎస్సై కృష్ణయ్య ఉన్నారు.